'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

రైల్వేలకు ఏదీ 'కవచ్'?

చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోనివారు చేసిన తప్పునే పదే పదే చేస్తూ పోయే దుర్గతికి లోనవుతారని సామెత. రైలు ప్రమాదాలకు ఈ సామెత సరిగ్గా సరిపోతుంది. ఒడిశాలో ఘోర రైలు దుర్ఘటన జరిగి ఐదునెలలు పూర్తి కావడానికి మరో మూడు రోజులు మాత్రమే ఉంది. బహనాగబజార్ స్టేషన్ సమీపంలో జరిగిన ఆ ప్రమాదంలో 280కి పైగా ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. రెండు ప్రయాణికుల రైళ్లు ఢీకొన్నాయి. సిగ్నలింగ్ లోపం అన్నారు. దర్యాప్తు కమిటీ వేశారు. ఆ దర్యాప్తు ఎంతవరకు వచ్చిందో తెలియదు. ఉగ్రవాద కోణాన్ని కూడా పరిశీలిస్తున్నామని రైల్వేమంత్రి చేసిన ప్రకటనపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని కంటకాపల్లి వద్ద మరో ఘోర దుర్ఘటన జరిగింది. మరోసారి రెండు ప్రయాణికుల రైళ్లు ఢీకొన్నాయి. 14 మందికి పైగా మరణించారు. మృతుల సంఖ్య పెరగొచ్చని అంటున్నారు. బహనాగబజార్ ప్రమాదంపై దర్యాప్తు జరిపిన రైల్వే భద్రతా కమిషనర్ ఏఎం చౌదరి రైల్వేబోర్డుకు ఇచ్చిన నివేదికలో పలు కీలక సూచనలు చేశారు. సిగ్నలింగ్, మెయింటెనెన్స్ వ్యవస్థలను మెరుగుపర్చాలని, ఆమోదిత సర్క్యూట్, వైరింగ్ డయాగ్రాంలు సిబ్బందికి అందించాలని సూచించారు.

మూడోది, అతి కీలకమైందీ నైపుణ్యం గల సిబ్బంది నియామకానికి సంబంధించింది. రైల్వే వ్యవస్థను ఎప్పుడు ప్రైవేటుపరం చేద్దామా, అదానీకి కారుచౌకగా ఎలా కట్టబెడదామా అని ఉరుకులాడే సర్కారు వీటి గురించి ఏం చేసిందనేది ఇప్పుడు ప్రశ్న. ఒకే ట్రాక్ మీదకు రెండు రైళ్లు రాకుండా ఆపే 'కవచ్' వ్యవస్థ దేశవ్యాప్తంగా ఎప్పుడు అందుబాటులోకి వస్తుందనేది మరో కీలక ప్రశ్న. 'కవచ్' వ్యవస్థ రూపకల్పనకు పదేండ్లకు పైగా సమయం పట్టింది. గత జూన్ నాటికి 2 శాతం రైళ్లకు మాత్రమే దీన్ని అమర్చగలిగారు. 'కవచ్' వ్యవస్థ లేకపోవడం కారణంగానే ఒడిశా దుర్ఘటన జరిగిందని రైల్వే పరిశీలకులు అప్పట్లో ఎత్తిచూపారు. రైల్వే భద్రతా కమిషనర్ తన సిఫారసులు చేయనంత వరకు ఏమోలే అనుకోవచ్చు. కానీ దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ ప్రమాదం తర్వాతైనా మేలుకున్నారా? అంటే అలాంటి దాఖలాలు కనిపించడం లేదు. అయితే తాజా దుర్ఘటనలో ప్రమాదానికి గురైన రెండు రైళ్లకు కవచ్ వ్యవస్థ లేదని తెలుస్తున్నది. అంటే కవచ్ విస్తరణ కార్యక్రమం నత్తనడకన సాగుతున్నట్టు అర్థమవుతున్నది. కవచ్‌ను నేరుగా కొనుగోలు చేయకుండా ఖర్చుకు భయపడి స్థానికంగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కవచ్ జాప్యానికి ఇది కూడా ఒక కారణం. ఫలితంగా రైల్వేల్లో భద్రత అగమ్యగోచరంగా తయారైంది. ఏపీ ప్రమాదం కారణాలు ఇంకా పూర్తిగా వెల్లడి కానప్పటికీ రెండు ప్రమాదాల మధ్య పోలికలు మాత్రం ఉన్నాయని చెప్పొచ్చు. విజయానికి అందరూ తండ్రులే.. అపజయం మాత్రం అనాథ అన్నారు పెద్దలు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీరుకు ఈ నానుడి అద్దం పడుతుంది. ముఖ్యంగా రైల్వేల నిర్వహణ విషయంలో కేంద్ర సర్కారు ట్రాక్ రికార్డు ఏ మాత్రం సమర్థనీయంగా లేదు.

ఇటీవలి కాలంలో జరుగుతున్న వరుస రైలు ప్రమాదాలతోనే రైల్వేల ప్రతిష్ఠ మసకబారుతున్నది. సాంకేతికత ఆకాశపుటంచులు చూస్తున్న ఈ రోజుల్లో భూమ్మీద రైళ్లను సురక్షితంగా నడపలేకపోతున్నదనే అపఖ్యాతి మూటగట్టుకుంటున్నది. గత పదేండ్ల బీజేపీ పాలనలో రైల్వేల నిర్వహణ నానాటికీ తీసికట్టుగా తయారైంది. వరుస ప్రమాదాలు చూస్తుంటే ప్రభుత్వ శక్తి సామర్థ్యాల మీదనే అనుమానాలు కలుగుతున్నాయి. వందేభారత్ రైళ్లకు వందోసారి పచ్చ జెండా ఊపేందుకు ప్రధాని మోదీ వెనుకాడరు. వాటిముందు ఫొటోలు దిగడం, ప్రచారం చేసుకోవడంలోనూ ఎప్పుడూ ఆయన ముందుంటమే కాదు, ఆయనను మించినవాళ్లు దొరకరు. ఇటీవల నమో భారత్ అనే పేరులో తన పేరు కూడా చూసుకొని ఆయన మురిసిపోయారు. ఈ ఫొటోలు, ప్రచారం సరే.. భద్రత మాటేమిటి? ఒక ప్రమాదం జరిగిందీ అంటే వ్యవస్థను దుమ్ముదులిపి లోటుపాట్లను సరిచేయాలని ఎవరైనా చెప్తారు. కానీ అలాంటివేవీ మోదీ సర్కార్ డిక్షనరీలో ఉన్నట్టు లేదు.

దండుకట్టి దరువెయ్యాలె

'అవకాశ వాదులు ఒక్కటై వస్తున్రు
ఢిల్లీ పేరు చెప్పి గల్లీని ఆగం చేసే
కుట్రలకు తెరలేపి ఊర్లల్ల పడుతున్రు
ఉద్యమకారులను వాడుకుని దొంగలు
అమరవీరుల చెప్పే లఫంగలు
తల్లి తెలంగాణను కాపాడే జెండాపై
కసాయి మూకలై విషం చిమ్ముతున్రు
రారా ఉద్యమకారుడా

దండుకట్టి దరువులెయ్యరా
రారా తెలంగాణ వీరుడా
తల్లి తెలంగాణ కాపాడరా
కుట్రదారులను తరమేందుకు సోదరా
తెలంగాణను కాపాడగ కదలిరా
దండుకట్టి దరువెయ్యాలిరా
గుండెనిండ గులాబీ జెండా
ఎగరెయ్యాలిరా'

***

గులాబీ కండువా మెడలో పడ్డదంటే నా బాధ్యత పెరిగింది. గులాబీ రంగు మెడలో పడగానే కాంగ్రెస్, కాషాయ మరకలు తొలగిపోయాయి. నాకే కాదు తెలంగాణ సమాజానికి కాంగ్రెస్, కాషాయ మరకలు ఉండొద్దు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామన్న (కేటీఆర్) నాకు ఇచ్చిన గౌరవాన్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంట. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ మనం చూస్తున్నం. మేము తెలంగాణ కోసం కష్టపడ్డోళ్లం. నాలాగే ఎంతోమంది బిడ్డలు తెలంగాణ కోసం కష్టపడి జైలుకు వెళ్లి.. వందలాది కేసులు మోసిన బిడ్డలు ఇప్పటికీ ఆయా రాజకీయాల్లో ఉన్నారు. ఉద్యమాలు చేసిన వాళ్లు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో ఉన్నారు. ఒక్క విద్యార్థి నాయకుడికైనా టికెట్ ఇవ్వమని అడిగితే.. ఎన్నికల టైం వచ్చేవరకు ముసలోళ్లను.. ముడిగోళ్లను.. పనికి రానివాళ్లను, పైసలు ఇచ్చేటోళ్లను. కేవలం పైసలకు టికెట్లకు అమ్ముకునే ఆ రెండు పార్టీలను చూస్తుంటే గుండెల్లో రాయిపడ్డట్టయింది. తెలంగాణ కోసం కొట్లాడింది గీ స్వార్థపరుల కోసమా? అనిపిస్తున్నది. మా విద్యార్థి నాయకత్వాన్ని గుర్తించాలె.. తెలంగాణ వచ్చి పదేండ్లు అయితాంది.. మాకు న్యాయం చేయాలె అని మొన్న ఏఐసీసీ ఆఫీసు ముందు మా వాళ్లు ధర్నా చేసిండ్లు. తెలంగాణ ఉద్యమం చేసిన బిడ్డలకు కాంగ్రెస్, బీజేపీలు ఏం చేయలేదు. ప్రతిపక్ష హోదాల్లో ఉన్న పార్టీలు ఏమీ చేయకపోయినా పదవుల్లో ఉండి.. అధికారంలో ఉండి కేసీఆర్ ఎంతో మంది విద్యార్థి నాయకులకు అవకాశాలు కల్పించారు. తెలంగాణ కోసం కొట్లాడిన ఎంతోమంది విద్యార్థి నాయకులను ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా, కార్పొరేషన్ చైర్మన్లు, జడ్పీ చైర్మన్లుగా 'మీరొచ్చిన జాగల మీరు సేవ చేయాల'ని కేసీఆర్ అవకాశాలు కల్పించిండు.

బాల్క సుమన్, గాదరి కిశోర్, ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్ వంటి ఎంతోమందికి నాడు ఉద్యమం చేసేప్పుడు వారి జేబుల్లో ఒక్క రూపాయి లేకున్నా 'విద్యార్థి ఉద్యమ నాయకులు' అని కేసీఆర్ అవకాశం ఇస్తే ప్రజలు కండ్లకు అద్దుకొని గెలిపించిండ్లు. ఉద్యమ నాయకులకు అసలైన గౌరవం ఇదే. పైసలుంటేనే టికెట్లు ఇస్తమని బీఆర్ఎస్ పార్టీ అనుకుంటే బాల్క సుమన్ ఎంపీ అవుతుండేనా? గాదరి కిశోర్ ఎమ్మెల్యే అవుతుండేనా? బొంతు రామ్మోహన్ హైదరాబాద్ మేయర్ అవుతుండేనా? కార్పొరేషన్ చైర్మన్లుగా ఆంజనేయ గౌడ్, గెల్లు శ్రీనివాస్ అవుతుండేనా? ఎంతమందని చెప్పాలి? 'మేం మాత్రమే పదవులను అనుభవిస్తాం. మీరు ఏండ్ల తరబడి పని చేయాలె.. ఎలక్షన్ రాంగనే మిమ్ముల్ని పక్కనపెడ్తం. డబ్బు సంచులు పట్టుకొచ్చినోళ్లకే టికెట్లు ఇస్తం' అనేది బీజేపీ, కాంగ్రెస్ పార్టీల సంస్కృతి. కాంగ్రెస్ పార్టీ తెలంగాణను మేమే ఇచ్చినం.. మేమే ఇచ్చినం అని అనుకుంటది. కానీ రెండు దఫాలుగా పనిచేసిన నాలాంటివాళ్లను టైం వచ్చేసరికి కాంగ్రెస్ పార్టీ అవతల పారేస్తది. ఉద్యమకారులతోని బీజేపీ అడ్డగోలు చాకిరి చేయించుకున్నది. 'బీజేపీ దళిత వ్యతిరేక పార్టీ దరువు ఎల్లన్న నువ్వెట్లా బీజేపీలకు పోతవు?' అని నన్ను ఎంతోమంది అన్నరు. కానీ, నేను ప్రజాసేవ చేయాలనుకునే లక్ష్యంతో ఆ పార్టీలో చేరిన. బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్షుడిని చేస్తే అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతుంది. మార్పు జరిగిపోద్ది అనుకొని నేనా రోజు బీజేపీలో చేరిన. ఆ భ్రమలో నేనే కాదు నాలాంటి వాళ్లు ఎంతోమందిమి నష్టపోయినం. ఆ రెండు పార్టీలకు ఎల్లన్న లాంటి ఉద్యమకారులు అక్కరకు రారు. కారణం ఒక్కటే ఉద్యమకారుల దగ్గర కోట్లకొద్దీ నోట్ల కట్టలు లేవు. ఆ రెండు పార్టీలది కోట్ల రూపాయలున్నవారికే టికెట్లు అమ్ముకున్న సంస్కృతి కాదా? కానీ, పేదసాదలకు అవకాశాలు కల్పించి అక్కున చేర్చుకున్నది భారత రాష్ట్ర సమితి ఒక్కటేనని అనుభవపూర్వకంగా గర్వంగా చెప్తున్న.

> నేను చాలాసార్లు బీఆర్ఎస్ పార్టీని వ్యతిరేకించిన. నీళ్లు, నిధులు, నియామకాలపై విమర్శించిన. అణగారిన వర్గాలకు ఇంకా న్యాయం జరగడం లేదు. తెలంగాణ కోసం ఆత్మబలిదానాలు చేసుకున్న అమరవీరులకు స్థూపం కడ్తానని కట్టలేదు అని అనేకసార్లు విమర్శించిన. కానీ, ఈరోజు ట్యాంక్ బండ్ నుంచి పోతుంటే ఈరోజు అమరజ్యోతి వెలుగుతుంటే 'ఇదిరా నా తెలంగాణ అమరుల త్యాగాలకు విలువ ఇచ్చిందని ఒక ఉద్యమకారుడిగా గర్వపడుతున్న.

నా మనసులో నా ఆశ, నా కల నెరవేరిందని గర్వంగా ఉంది. అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి దండవేయరు అని చాలామంది విమర్శించినట్టే నేనూ చాలా వేదికల మీద విమర్శించిన. దండేసి దండం పెట్టంగనే కాదు ఆ జాతికి నిజమైన న్యాయం చెప్పాలని ఎంతో కొంత అవకాశం కల్పిస్తూ సంపూర్ణంగా ఒక లాంగ్ రన్ ఎజెండాపెట్టుకొని దళితబంధు అమలుచేస్తున్న బీఆర్ఎస్‌కు దళితజాతి రుణపడి ఉంటది.

> పైసలుంటేనే టికెట్లు ఇస్తమని బీఆర్ఎస్ పార్టీ అనుకుంటే బాల్క సుమన్ ఎంపీ అవుతుండేనా? గాదరి కిశోర్ ఎమ్మెల్యే అవుతుండేనా? బొంతు రామ్మోహన్ హైదరాబాద్ మేయర్ అవుతుండేనా? కార్పొరేషన్ చైర్మన్లుగా ఆంజనేయ గౌడ్, గెల్లు శ్రీనివాస్ అవుతుండేనా? ఎంతమందని చెప్పాలి? 'మేం మాత్రమే పదవులను అనుభవిస్తాం. మీరు ఏండ్ల తరబడి పనిచేయాలె.. ఎలక్షన్ రాంగనే మిమ్ముల్ని పక్కనపెడ్తం. డబ్బు సంచులు పట్టుకొచ్చినోళ్లకే టికెట్లు ఇస్తం' అనేది బీజేపీ, కాంగ్రెస్ పార్టీల సంస్కృతి.

> దండేసి దండం పెట్టుడు కాదు.. అంబరాన్నంటే అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టిన ఘనత కేసీఆర్‌దని ఈరోజు గర్వంగా చెప్తున్న. అంబేద్కర్ ఆశయాలు నెరవేరాలె.. అమరుల ఆకాంక్షలు నెరవేరాలె. ఉద్యమకారులకు న్యాయం జరగాలె. ఇవే నా ఆకాంక్షలు. అంబేద్కర్ విగ్రహ ప్రాంగణం దేశంలో మరెక్కడా చూడని విధంగా టూరిజం స్పాట్‌గా మారింది. ఆ మహానుభావుడి విగ్రహాన్ని పెట్టినందుకు చేతులు జోడించి నమస్కరిస్తున్న. ఇలాంటి పనులు చిత్తశుద్ధి ఉంటేనే చేస్తరు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లకు అవకాశం ఉంటే అంబేద్కర్‌ను కాళ్ల దాకా లేపి నిలబెట్టి విడిచిపెట్టేవాళ్లు.. కాళ్లదాకా నిర్మాణం చేసి విడిచిపెట్టేవాళ్లు లేకుంటే తలకాయ మందం విగ్రహాన్ని పెట్టేవాళ్లు. దళితజాతి పట్ల. అంబేద్కర్ దార్శనికత పట్ల చిత్తశుద్ధి, ప్రజాస్వామ్యం పట్ల నిబద్ధత ఉంది కాబట్టే కేసీఆర్ ఇవన్నీ చేస్తున్నడు.

తెలంగాణ ఉద్యమ ట్యాగ్‌లైన్ అయిన 'నీళ్లు, నిధులు, నియామకాలు' రెండు టర్మ్‌ల్లో నీళ్ల కలను సంపూర్ణం చేశారు. ఇవ్వాళ ఏ ఊరు చూసినా జలకళతో తొణకిసలాడుతున్నది. ఊళ్లన్నీ జలభాండాగారాలైనాయి. నీళ్లల్లో సంపూర్ణత సాధించాం. నిధుల విషయంలోనూ సంపూర్ణత సాధించటం వల్లే దేశంలో ఎక్కడా లేనివిధంగా అద్భుతమైన పథకాలను అమలుచేసుకోగలుతున్నాం. రెండు టర్మ్‌లు రెండు సంపూర్ణమయ్యాయి. నియామకాల విషయంలోనూ సంపూర్ణత సాధించాలన్నదే ఉద్యమకారులు, ప్రజల న్యాయమైన ఆకాంక్ష. అయితే సర్దుకోవాలంటే సమయం కావాలె. మూడో టర్మ్‌లో సంపూర్ణ నియామకాల మీద దృష్టిసారించాలె అని రామన్నతో అంటే బరాబర్ చేస్తమని మాటిచ్చిండు. అదే తెలంగాణకు భరోసా. ఇటీవల ఒక అమ్మాయి అనివార్య కారణాలతో చనిపోతే ఆ కుటుంబానికి నేనుంటానని అక్కున చేర్చుకున్నరు. ఉద్యమాలు చేసినవు. వందల కేసులు.. అనేకసార్లు జైలుకు పోయినవు.. ఇంకా అటు ఇటు ఎందుకు తిరుగుతవు అన్నరు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోయిన. నమ్మి ఆ పార్టీల జెండాలు మోసిన ఉద్యమకారునికే న్యాయం చేయని పార్టీలు తెలంగాణ సమాజానికేం న్యాయం చేస్తరు? సమయం వచ్చింది.. 'ఉద్యమాలు చేసినోడిని ఉద్యమకారులతో ఉండాలె. ఉద్యమజెండాలు పట్టుకొని తిరుగాలె అని ఉద్యమపార్టీకి వచ్చిన. సంతోషంగా ఉన్నది. ఈ దిశగా అందరూ ఆలోచించాలె. ఎన్నికల సమయంలో మరోసారి తెలంగాణను ఆగం చేయటానికి.. చాలామంది తెలంగాణపై అనేక కుట్రలు చేస్తున్నరు. ఆ కుట్రలను తిప్పికొట్టేందుకు.. ఉద్యమకారులందరూ ఐక్యం కావాలి. జై తెలంగాణ.

- దరువు ఎల్లన్న
(వ్యాసకర్త: ప్రముఖకవి, గాయకుడు)

> మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ గారు 'రైతులారా! రాజకీయ వర్షం పడుతుంది.. మోసపోయి మీ విత్తనాలు చల్లకండి' అంటూ చేసిన హెచ్చరికను గుర్తుచేసుకొని అప్రమత్తం కావలసిన సమయమిది.

హస్తఖతం

భారతదేశం వ్యవసాయాధారిత దేశం. మొదటి పంచవర్ష ప్రణాళిక మొదలుకొని ఇప్పటివరకు వ్యవసాయానికి ఎంత వీలైతే అంత ప్రోత్సాహకాలు అందిస్తూ ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నం కొనసాగుతున్నది కానీ, అనుకున్న రీతిలో, జనాభాకు తగ్గట్టు ఆహారాన్ని అందించడంలో పాలకులకు దూరదృష్టి కరువైంది. అందుకే ఆకలి సూచిలో ఏటా వెనక్కిపోతున్నాం. సరైన సబ్సిడీలు, విత్తనాలు, ఎరువులు అందించడంలో గత పాలకుల నిర్లక్ష్యం కారణమే నేటి దేశ రైతుల పరిస్థితికి కారణం.

అయితే, ఇందుకు భిన్నంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనతికాలంలోనే దండుగన్న వ్యవసాయాన్ని పండుగలా మార్చి దేశానికే బువ్వ పెట్టే స్థాయికి మన తెలంగాణ రైతన్న ఎదిగాడు. ఇందుకుగాను కేసీఆర్ తీసుకున్న సాహసోపేత నిర్ణయాల్లో రైతుబంధు అగ్రభాగాన నిలిచింది. గతంలో ఐదెకరాలున్న సన్నకారు రైతు ఇరవై గుంటల్లో వరి పండించాలంటే నానా యాతన పడాల్సి వచ్చేది. నాణ్యమైన కరెంటు రాక, గంట గంటకు ఫీజులు ఎగిరిపోయి, మోటర్లు కాలిపోయి, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి అరిగోస పడేది. నా చిన్నతనంల మా శెల్కలల్ల నలుగురు రైతులు మీటింగ్ పెడితే ఎక్కడ ట్రాన్స్‌ఫార్మర్ పెట్టించాలి, ఓవర్ లోడైంది. మనం నలుగురం గూడి ఎట్లనన్న ఒక బుడ్డి పెట్టించుకుందాం, సెపరేటు లైన్ ఏపించుకుందాం, ఎట్లా ఫైరవీ చేద్దాం, తింటాందుకు ఇంట్ల గింజల్లేవు అని నెత్తికి చెయ్యి పెట్టుకొని ఆలోచనలు చేస్తుండిరి. మోటర్లు రిపేర్ చేస్తూ కరెంటు షాక్ కొట్టి చనిపోయిన రైతుల ఆర్తనాదాలు, అప్పుల బాధలు తాళలేక పురుగుల మందులు తాగి సచ్చినోళ్లు కొందరైతే, ఎద్దు ఎవుసాయం వదిలి పట్నంలో అడ్డా కూలీలుగా మారినోళ్లు ఎందరో. ఇప్పుడు అసొంటి ముచ్చట్లు ఏ రైతు పెట్టంగా నేనైతే చూస్తలేను. తెలంగాణ నిండా పుష్కలంగా నీళ్లు, పారే నదులు, పొంగే వాగులు, 24 గంటలు నాణ్యమైన కరెంటు వొస్తున్నది. పెట్టుబడికి రంది లేదు, ఎరువులకు యాతన లేదు. ఇప్పుడున్నదల్లా తెలంగాణలో కూలీల కొరతనే! పక్క రాష్ట్రాల్లోంచి వడ్లు కావాలని ఆర్డర్ పెట్టుకోవడం చూస్తే చాలా సంబురమనిపిస్తున్నది. మొన్న మ్యానిఫెస్టోలో పెట్టినటువంటి రేషన్‌కార్డున్న ప్రతి ఒక్కరికి ఇప్పటి నుంచి ఇక సన్న బియ్యం ఇస్తామంటున్నది బీఆర్ఎస్. ఎందుకంటే ఇది మసిపూసి మారేడుకాయ చేసి ఓట్లు దండుకునే హామీ అసలే కాదు కాబట్టి.

ఇగ తెలంగాణ అంత పచ్చగైనంక రైతులను చూసి ఓర్వలేని కాంగ్రెస్ నాయకులు ఎవరికి తోచిన రీతిలో వారు వ్యవసాయంపై కారుకూతలు కూస్తున్నారు. ఒకాయనేమో 24 గంటల కరెంటు అక్కరే లేదు, ఏదో 3, 4 గంటలు ఇచ్చి మమః అనిపిస్తే వాళ్ల సావు ఏదో వాళ్లు సస్తరు అనబట్టే. కాంగ్రెస్ పెద్దలు 'రైతుబంధు' ఆపాలంటూ ఏకంగా ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాశారంటే అది వారిని ఎంతగా భయపెడుతున్నదో అర్థమవుతున్నది. కానీ కోడ్ అమల్లో ఉంటే కొత్త పథకాలు ప్రకటించరాదు, పాత వాటిని ఆపాలని లేదు. అయినప్పటికీ రాద్ధాంతం చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు. ఎవరి రాజకీయం వాళ్లు చేసుకుంటే ఇబ్బంది లేదిక్కడ. కానీ, వీళ్ల స్వార్థానికి రైతులను బలి చేయజూస్తున్నారు. దీన్ని పార్టీలకతీతంగా ఖండించాల్సిందే.

రైతులను కాంగ్రెస్ వాళ్లు కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తున్నారే తప్ప కనీసం మనుషులుగా చూడటం లేదు. దేశానికి అన్నం పెట్టే రైతన్న దేశానికే వెన్నెముక అన్న సంగతి మరిచి వారి అధికార దాహం కోసం నోటికాడి బుక్కను లాగేసే ప్రయత్నానికి పూనుకున్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రైతులకు మేలుచేసే పథకాలు లేకపోగా, కాంగ్రెస్ పార్టీ పెద్దల పరిస్థితి చూస్తుంటే 'అమ్మ పెట్టదు, అడుక్క తిననివ్వదు' అన్న చందంగా ఉంది. ఇటువంటి రైతు వ్యతిరేక కాంగ్రెస్‌ను ఖతం చేసే బాధ్యత ప్రతి ఒక్క రైతు తీసుకోవాల్సిన అవసరం ఆసన్నమైంది.

ముఖేష్ సామల
97039 73946

ప్రజల హక్కులు, మేధావుల హక్కులు

టంకశాల అశోక్

> నక్సలైట్ ఉద్యమం బలంగా ఉన్న రోజుల్లో ప్రజల హక్కులే మేధావుల హక్కులుగా ఉండేవి. ఆ ఉద్యమం బలహీన పడిన తర్వాత, తెరచాప తెగిపోయిన కొందరు మేధావులకు ప్రజలతో అగాధం ఏర్పడింది. ఇప్పుడు వారు బాలగోపాల్ వలె గ్రామాలకు వెళ్లరు. సామాన్య ప్రజలను కలిసి వారి మంచి చెడులను వారినడిగి తెలుసుకోరు. వారి జీవితాల్లో వస్తున్న మార్పులేమిటో గమనించరు.

> నగరాల్లో కూర్చొని ఊహాగానాలు చేస్తూ, తమ ఆలోచనలే ప్రజల ఆలోచనలైనట్టు వారిపై రుద్దజూస్తారు. ఆ క్రమంలో ప్రజల హక్కులు, ఈ తరహా మేధావుల హక్కులు వేర్వేరుగా రూపొందుతాయి. తెలంగాణలో ప్రస్తుతం ఈ స్థితి కనిపిస్తున్నది.

ప్రజల హక్కుల గురించి మాట్లాడే మేధావులు సర్వసాధారణంగా మధ్య తరగతివారు, ఎగువ మధ్య తరగతివారు అయి ఉంటారు. మధ్య తరగతి నుంచి వచ్చేవారు స్వయంగా జీవిత సమస్యలను ఎదుర్కొన్నవారు అయి ఉంటారు. ఆ కారణంగా ప్రజల సమస్యలు, హక్కుల విషయంలో వారికి రెండు విధాలైన నిబద్ధతలుంటాయి. ఒకటి, తాము స్వయంగా అనుభవించిన దానిని బట్టి కలిగింది. రెండు, తాము కండ్లారా చూసిన దానిని బట్టి కలిగింది. కనుక ఈ నిబద్ధత కేవలం మేధోపరమైనది కాదు. అది సజీవమైనది. ఆ పునాది మరింత బలమైనది. తాత్కాలికమైనదిగాక దీర్ఘకాలం పాటు కొనసాగేది.

మరొకవైపు ఎగువ మధ్య తరగతి నుంచి వచ్చే మేధావులు బాగా చదివి, మంచి ఉద్యోగాలు చేస్తూ, లేదా రిటైరై, మంచి కుటుంబాలు కలిగి, ఇప్పటికీ సంపాదనాపరులై, సకల సౌకర్యాలతో జీవిస్తుండి ఉంటారు. ప్రజల హక్కుల పట్ల వీరి నిబద్ధతకు తమ జీవిత నేపథ్యాలతో ఎటువంటి సంబంధం ఉండదు. అది కేవలం మేధోపరమైనది. కనుక అందులో సజీవత పాలు తక్కువ. పునాదిలో బలం తక్కువ. దీర్ఘకాలికత తక్కువ. అదే సమయంలో ఇక్కడ ఒక తేడాను గమనించాలి. మార్క్సిస్టు భావజాలంలో 'డీక్లాసిఫై' అనే మాట ఒకటుంది. అంటే, ఒక తరగతి (క్లాస్)కి చెందిన వ్యక్తి తన ఆలోచనలు, వ్యవహరణ వల్ల ఆ ఎగువ తరగతికి దూరమై అంతకన్న దిగువ తరగతి లక్షణాలలో భాగం కావటమన్నమాట. ఎగువ తరగతికి చెందినప్పటికీ ఈ విధంగా డీక్లాసిఫై అయ్యే మేధావులు తక్కువేమీ కాదు. అందుకు బాలగోపాల్ ఒక ఉదాహరణ.

నక్సలైట్ ఉద్యమం బలహీనపడిన దాని ప్రభావం కొంత, తమ ఎగువ తరగతి నేపథ్య ప్రభావం కొంత కలగలసిన మేధావులకు, పైన అనుకున్నట్టు, క్రమక్రమంగా తమ హక్కులకు, ప్రజల హక్కులకు మధ్య భిన్నత్వం ఏర్పడటం మొదలైంది. ఇరువురి జీవితాల మధ్య, ఆలోచనల మధ్య తేడాలు వస్తుండటం ఇందుకు ప్రధాన కారణం. అందువల్ల వీరిద్దరి దృక్పథాలు, లక్ష్యాలు కూడా సహజంగానే మారసాగాయి. ఈ తరహా ఎగువ మధ్యతరగతి మేధావుల ఆలోచనలు, లక్ష్యాలూ నక్సలైట్ ఉద్యమం బలంగా ఉండినప్పటి సామాన్య ప్రజల జీవితాలకు దూరమవుతూ, నగర ప్రజల సమస్యలకు, రాజకీయాలకు దగ్గర కావటం మొదలైంది. వీరు మాట్లాడే హక్కులకు ఒకప్పుడు సామాన్య ప్రజల సమస్యలు, హక్కులతో మమేకత ఉండగా, ఇప్పుడు తాము దగ్గరవుతున్న కొత్త ప్రపంచపు హక్కులతో మమేకత ఏర్పడటం మొదలైంది.

> తెలంగాణ సామాన్యుల గతాన్ని, వర్తమానాన్ని ఒకసారి మననం చేసుకుంటే, నక్సలైట్ ఉద్యమం, దానితో పాటు పౌర హక్కుల ఉద్యమం బలంగా ఉండిన కాలంలో ప్రజలకు ప్రధానంగా మూడు సమస్యలుండేవి. ఒకటి, ఆర్థిక సమస్యలతో, ఉపాధిరాహిత్యంతో ముడిపడినవి. రెండు, భూస్వాములు, ఇతర పెత్తందార్ల అణచివేత, దోపిడీతో సంబంధం గలవి.

మూడు, సాధారణ రూపంలోనూ, తమ నిరసనలు, విప్లవోద్యమాల అణచివేతలోనూ ఎదురయ్యే పోలీసు హింస. ఈ మూడు కూడా ఆ కాలమంతా ఉండేవి. ఆ కాలం అనే దానిని మరొక మాటలో చెప్పాలంటే, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడకముందు నాటి మాట అని చెప్పుకుంటే సరిపోతుంది. ఆ తర్వాత నుంచి ఈ మూడు పరిస్థితులు కూడా వేగంగా తగ్గుతూ వస్తున్నాయి. అట్లా తగ్గటమన్నది వర్తమానం. తెలంగాణ అంతటా ప్రజలతో కలసి, ఓపెన్‌మైండ్‌తో మాట్లాడిన ఎవరికైనా ఈ మూడు మార్పులు దృష్టికి వస్తాయి.

పైన పేర్కొన్న మూడింటిలో ఆర్థిక సమస్యలు, ఉపాధి రాహిత్యం చెప్పుకోదగిన స్థాయిలో తగ్గాయి. ఈ సమస్య తగ్గుదల ఇంకా కొనసాగుతున్నది. ఈ మాట అన్ని గ్రామీణ వర్గాలకు వర్తిస్తుంది. గ్రామాల నుంచి వచ్చి హైదరాబాద్ తదితర చోట్ల పనిపాటలు చేసుకుంటున్న లక్షలాది మందికీ వర్తిస్తుంది. భూస్వాములు, ఇతర పెత్తందార్ల దోపిడీ, అణచివేతలు నక్సలైట్ ఉద్యమకాలంలోనే వారి భయం వల్ల తగ్గసాగగా, రాష్ట్రం ఏర్పడిన సమయానికి ప్రజలకు కలిగిన అదనపు చైతన్యం వల్ల, కొత్త ప్రభుత్వ విధానాల వల్ల, ప్రజలకు లభించసాగిన ఆర్థిక అవకాశాల వల్ల మరింతగా తగ్గాయి. ఇవే కారణాల వల్ల గ్రామీణ ప్రజల ఒకప్పటి అసంతృప్తి, నిరసనలు తగ్గుతుండగా మరొకవైపు నక్సలైట్ ఉద్యమానికి ఆధారం తగ్గసాగింది. స్వీయ బలహీనతల వల్ల కూడా ఉద్యమం తనంతట తానే దాదాపు లేకుండాపోయింది. ఉద్యమానికి ప్రజల నుంచి, యువకుల నుంచి ఆదరణ అడుగంటింది. ఇప్పుడు ప్రజలు, యువకులు కొత్త రాష్ట్రం నుంచి, ఆర్థికాభివృద్ధి నుంచి అవకాశాలను వెతుక్కుంటున్నారు, డిమాండ్ చేస్తున్నారు. ఆ విధంగా ప్రజలకు ఈ మేధావుల నుంచి పౌరహక్కుల పరిరక్షకులుగా ఒకప్పుడు ఉండిన అవసరం ఇప్పుడు లేకుండాపోయింది. ఇది పరిస్థితులతో పాటు వచ్చిన పరివర్తన.

ఆసక్తికరం ఏమంటే, ఇందుకు సమాంతరంగా, ఎగువ మధ్య తరగతికి చెందిన నిన్నటి హక్కుల మేధావులు కూడా కొత్తరకం హక్కుల అవకాశాలను వెతుక్కుంటున్నారు. తమ కొత్త ఆలోచనలకు తగిన కొత్త అవతారంలోకి ప్రవేశిస్తున్నారు. ఇప్పుడు వారు గ్రామీణ పరిస్థితులను, మార్పులను చూడరు. ఎప్ప